


- పెద్దపల్లి పార్లమెంట్‌పై ప్రధాన పార్టీల నజర్
- క్యాడర్‌ను సమయాత్తం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ
- టికెట్లపై ఆశావహుల ఆశలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మరో మూడు మాసాల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనుండడంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల వేటలో తలమునకలు అవుతున్నాయి. పెద్దపల్లి స్థానాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. గత పదిహేను రోజుల నుంచి ఆయా పార్టీలు హైదరాబాద్‌లో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ క్యాడర్‌ను సమాయాత్తం చేస్తున్నాయి. బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు వ్యూహ రచన చేస్తుండగా, పలువురు నాయకులు తమకే టికెట్ ఇవ్వాలంటూ పార్టీ నేతలను అభ్యర్థిస్తూ వస్తున్నాయి. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి రిజర్వు చేసిన విషయం తెలిసిందే. 1952లో ఏర్పడ్డ పెద్దపల్లి పార్లమెంట్ నియోజవర్గానికి 16సార్లు ఎన్నికలు జరగగా, పదిసార్లు కాంగ్రెస్ పార్టీ, 1967లో ఒకసారి టీపీఎస్, 1984, 1998, 1999లో టీడీపీ, 2014, 2018లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించాలని బీఆర్ఎస్, ఎలాగైనా ఖాతా తెరవాలని బీజేపీ, హస్తగతం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గట్టి ప్రయత్నాలు చేస్తున్నది. నెల రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లోనూ పెద్దపల్లిని హస్తగతం చేసుకుంటామని ఆ పార్టీ నేతలు అంటున్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ హవా ఉందని, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మానియా ఉన్నందున ఈసారి బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. హ్యాట్రిక్ సాధిస్తామనే ధీమాతో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

● కాంగ్రెస్‌లో పోటాపోటీ..

కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం పోటాపోటీ నెలకొన్నది. మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన చెన్నూరు నుంచి పోటీ చేసి గెలుపొందారు. తన కుమారుడు వంశీకృష్ణకు ఎంపీ టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ మంత్రి ఆగం చంద్రశేఖర్ సైతం టికెట్ రేసులో ఉన్నారు. నేతకాని సామాజిక వర్గానికి చెందిన టీపీసీసీ కార్యదర్శి గోమాసె శ్రీనివాస్ నియోజకవర్గంలో తమ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉన్నారని, తనకే టికెట్ ఇవ్వాలని పార్టీ నాయకత్వాన్ని కోరుతున్నారు. టీపీసీసీ కమిటీ ట్రైనింగ్ మెంబర్, ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ మాజీ జాతీయ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్ పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. సుల్తానాబాద్‌కు చెందిన వరప్రసాద్ ఎన్ఎస్‌యుఐ ద్వారా రాజకీయ అరంగేట్రం చేశారు. ఇరవై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి విస్తృత సేవలు అందించారు. సుల్తానాబాద్ నుంచి ఆయన సతీమణి ఊట్ల రమాదేవి 2014లో జడ్పీటీసీగా గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లోనూ ఆయన పార్టీ టికెట్ ఆశించారు. టీపీసీసీ నుంచి మొదలుకుని ఏఐసీసీ వరకు పలువురి నేతలు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలతో మంచి సంబంధాలు కలిగి ఉన్నాడు. ఈసారి ఎలాగైనా పార్టీ టికెట్ దక్కించుకోవాలని ఆరాట పడుతున్నారు. పెద్దపల్లికి చెందిన యువ నాయకుడు పెర్క శ్యామ్ సైతం టిక్కెట్ కోసం యత్నిస్తున్నారు. అయితే పార్టీ టిక్కెట్ ఎవరి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొన్నది.

● బీజేపీ నుంచి పలువురి యత్నాలు..

బీజేపీ టికెట్ కోసం కూడా పలువురు నాయకులు పోటీ పడుతున్నారు. గోదావరిఖనికి చెందిన, బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగాల కుమార్, మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, కరీంనగర్‌కు చెందిన బీజేపీ ఎస్సీ రాష్ట్ర మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, గోదావరిఖనికి చెందిన క్యాతం వెంకటరమణ టికెట్ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. సోగాల కుమార్ గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నుంచి పోటీ చేశారు. జర్నలిస్టుగా పని చేసి రాజకీయాల్లోకి వచ్చిన కుమార్ మొదటి నుంచి బీజేపీలోనే కొనసాగుతూ వస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర వహించడంతో పాటు పార్టీలో వివిధ స్థాయి పదవులు చేపట్టారు. 2009, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన ధర్మపురి నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి పోటీ చేసి సుమారు లక్ష ఓట్లు సాధించారు. కరీంనగర్‌కు చెందిన జాడి బాల్‌రెడ్డి టీడీపీ ద్వారా రాజకీయాల్లో చేరారు. 2019లో బీజేపీ చేరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ధర్మపురి టికెట్ ఆశించారు. అది దక్కకపోవడంతో పార్లమెంట్ పరిధిలో నేతకాని సామాజికవర్గం ఓటర్లు ఎక్కువగా ఉన్నారని, అదే సామాజిక వర్గానికి చెందిన తనకే పెద్దపల్లి టికెట్ ఇవ్వాలని పార్టీ పెద్దలను కోరుతున్నారు. పార్టీ అధిష్ఠానం వీరిలో ఎవరికైనా టికెట్ ఇస్తుందా, ప్యారాచూట్ నేతలు ఎవరైనా వస్తే వారికి ఇస్తుందా తెలియడం లేదు. మొత్తంగా పార్లమెంట్ పరిధిలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

● బీఆర్ఎస్ టికెట్ ఎవరికో..

గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన బొర్లకుంట వెంకటేశ్ ఎంపీగా గెలుపొందగా, ఈసారి ఆయనకే టికెట్ ఇస్తారా, మరెవరికైనా టికెట్ ఇస్తారా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. 2014లో ఇదే స్థానం నుంచి గెలుపొందిన బాల్క సుమన్ 2018లో ఎమ్మెల్యేగా గెలుపొందగా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందారు. అలాగే ధర్మపురి నుంచి వరుస విజయాలు సాధించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కూడా ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందారు. సిట్టింగ్ ఎంపీ ప్రజలకు పెద్దగా అందుబాటులో లేరని, ఆయనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, పార్టీ చేపట్టిన సర్వేల ద్వారా వెల్లడైనట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో కొప్పుల ఈశ్వర్‌కు గానీ, బాల్క సుమన్‌కు గానీ టికెట్ ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది.

పదోన్నతులతో బాధ్యత పెరుగుతుంది : సీపీ


పదోన్నతి పొందిన అధికారులతో సీపీ రెమా రాజేశ్వరి

కోల్‌సిటీ, జనవరి 12: పోలీస్‌శాఖలో పదోన్నతుల ద్వారా స్థాయితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని, బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజల్లో పోలీస్‌శాఖ పట్ల విశ్వాసాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా నడుచుకోవాలని రామగుండం సీపీ రెమ రాజేశ్వరి సూచించారు. శుక్రవారం కమిషనరేట్ పరిధిలో ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన 8మంది, ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన 10మంది, హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన 19మందిని తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పని చేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటారన్నారు. మానసికంగా, శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్ల కుంట పోచలింగం ఉన్నారు.

మంథని సీఐ సతీష్ బదిలీ..

మంథని, జనవరి 12: మంథని సీఐగా విధులు నిర్వహిస్తున్న జీ. సతీష్‌ను ధర్మపురికి బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సీఐల బదిలీల్లో భాగంగా మంథని నుంచి సతీష్‌ను ధర్మపురికి బదిలీ చేశారు. మంథని సీఐగా ఎవరికి పోస్టింగ్ ఇవ్వలేదు.

నేడు మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

మంథని, జనవరి 12: మంథని నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి శనివారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటించనున్నట్లు అధికార వర్గాలు శుక్రవారం తెలిపాయి. రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ నూతన భవనాన్ని, పీహెచ్‌సీ భవనాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు. మంథని క్యాంపు ఆఫీస్‌లో కలెక్టర్, అధికారులతో మంథని నియోజకవర్గ సమస్యల పై సమీక్షా సమావేశం నిర్వహించి కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. మండలంలోని నాగారంలో నూతన గ్రామపంచాయతీ, కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డును ప్రారంభించనున్నారు.

ఖని ఆసుపత్రిని సందర్శించిన ఎన్టీపీసీ సీఎస్ఆర్ బృందం

కళ్యాణ్‌నగర్, జనవరి 12: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని శుక్రవారం సీఎస్ఆర్ జీఎం విజయ్‌కుమార్ సిఖిందర్ ఆధ్వర్యంలో బృందం సందర్శించింది. జనరల్ ఆసుపత్రిలోని రెండవ అంతస్థు భవన నిర్మాణానికి గతంలో ఎన్టీపీసీ యాజమాన్యం రూ.6.5కోట్లను మంజూరు చేసింది. అదేవిధంగా ఆపరేషన్ థియేటర్‌లోని పరికరాలు, బెడ్లను కూడా ఎన్టీపీసీనే మంజూరు చేసింది. ప్రభుత్వాసుపత్రికి కావాల్సిన మరిన్ని సౌకర్యాలపై ఈ బృందం పరిశీలన జరిపింది. భవిష్యత్‌లో మరిన్ని నిధులు కేటాయిస్తామని విజయ్ కుమార్ సిఖిందర్ హామీ ఇచ్చారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

కోల్‌సిటీటౌన్, జనవరి12: ఇటీవల పెద్దపల్లిలో జరిగిన జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్‌డీ సానియా ప్రతిభ కనపర్చి ద్వితీయ బహుమతి సాధించింది. కలెక్టర్ ముజుమ్మిల్‌ఖాన్ చేతుల మీదుగా బహుమతి అందుకుంది. ప్రిన్సిపల్ మాధవి, ఎన్ఎస్ఎస్ పీవో జీడీ కనకయ్య, అధ్యాపకులు సానియాను అభినందించారు.

జాతీయ యువజన అవార్డు గ్రహీతకు సన్మానం

ఎలిగేడు, జనవరి 12 : మండలంలోని ధూళికట్ట గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త జాతీయ అవార్డు గ్రహీత కొండ రవియాదవ్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ అరుణశ్రీలు ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సన్మానించడం పట్ల ప్రజాప్రతినిధులు రవికి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపన్యాస పోటీల్లో ప్రతిభ

కాల్వశ్రీరాంపూర్, జనవరి 12: మండలంలోని తారుపల్లి గ్రామానికి చెందిన ఈర్ల మేఘన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలో ప్రతిభకనబరిచి మొదటిస్థానంలో నిలిచింది. భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ స్పోర్ట్స్, నెహ్రూ యువ కేంద్రం పెద్దపల్లి జిల్లాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో గాయత్రి జూనియర్ కళాశాలలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఈర్ల మేఘన మొదటి స్థానంలో నిలిచి జ్ఞాపికను అందుకున్నది.

స్వామి వివేకానంద జీవితం స్ఫూర్తిదాయకం : కలెక్టర్


వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, జనవరి 12 : నేటితరం యువతకు స్వామి వివేకానంద జీవిత చరిత్ర స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ యువజన దినోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, భారత దేశఖ్యాతిని, సంప్రదాయాలను ప్రపంచదేశాలకు చాటి చెప్పిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని, ఆయన జీవిత చరిత్ర ఆధారంగా చేసుకుని నేటి యువత రాబోవు తరాలకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. అనంతరం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు మెమొంటోలను కలెక్టర్, అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి సురేష్, నేషనల్ యూత్‌అవార్డు గ్రహీతలు కొండా రవి,ఈదునూరి శంకర్, జిల్లా అధికారులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరిఖని బస్టాండ్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జనవరి 12: గోదావరిఖని బస్టాండ్‌ను త్వరలో మోడల్ బస్టాండ్‌గా తీర్చిదిద్దుతానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని బస్టాండ్‌ను పరిశీలించారు. అనంతరం ప్రయాణీకులతో మాట్లాడారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో ప్రయాణీకులకు అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులు కూర్చునేందుకు మరిన్ని కుర్చీలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. బస్టాండ్ అభివృద్ధిపై డీపీఆర్‌ను తయారుచేసి ఇవ్వాలని ఆర్టీసీ అధికారులను కోరారు. మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బాల రాజ్‌కుమార్ ఉన్నారు.


బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అందరికి సముచిత స్థానం..

గోదావరిఖని, జనవరి 12:కార్యకర్తలే తన బలమని, వారు లేనిదే తాను లేనని, అందరికి సముచిత స్థానం ఉంటుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలందరూ తనకు సమానమేనని, ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనేది లేదని, తాను గెలిచిన తరువాత 30రోజుల్లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం జరిగిందని, ఎవరూ కూడా కార్యకర్తలు తప్పు చేయవద్దని, తప్పు చేస్తే వారు తనకు శాశ్వతంగా దూరమవుతారని చెప్పారు. రామగుండం ప్రజలు తనపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, వమ్ము చేయవద్దని, రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి అందరం కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. రామగుండం కార్పొరేషన్‌లో ఒక్క రూపాయి కూడా లేదని, నిధుల కోసం ముఖ్యమంత్రికి వివరించడం జరిగిందని, చాలా చోట్ల రోడ్లు, డ్రైనేజీలు సక్రమంగాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు అనుగుణంగా తన పరిపాలన కొనసాగుతుందన్నారు. డివిజన్ అధ్యక్షులు డివిజన్‌లోని ప్రజా సమస్యలను తెలుసుకుని మున్సిపల్ శాఖ అధికారులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించే విధంగా చొరవ చూపాలని, ప్రజలకు ఏ సమస్యలు వచ్చినా డివిజన్ అధ్యక్షులే బాధ్యత తీసుకోవాలని సూచించారు. రామగుండం నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, కొలిపాక సుజాత, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, మాదరబోయిన రవికుమార్, ఫజల్ బేగ్, తిప్పారపు శ్రీనివాస్, తాళ్లపల్లి యుగంధర్, గడ్డం శేఖర్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల అభివృద్ధికి కృషి..

కోల్‌సిటీ, జనవరి 12: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతి డివిజన్‌లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శుక్రవారం 46వ డివిజన్ పరిధిలోని గోదావరిఖని ఎన్టీఆర్‌నగర్‌లో రూ.20లక్షలతో కల్వర్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల హయాంలో రామగుండంలోని డివిజన్లు పూర్తిగా అభివృద్ధికి దూరమయ్యాయన్నారు. ఎవరికి ఏ ఇబ్బందులు అయినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్పొరేటర్ పాతిపెల్లి లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్‌కుమార్, కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, మారెల్లి రాజిరెడ్డి, పెద్దెల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పటిష్ట చర్యలు : కలెక్టర్

పెద్దపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బాలకార్మికుల నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ) ద్వారా నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంపై, గతంలో చేపట్టిన ముస్కాన్ కార్యక్రమం వివరాలను జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కమలాకర్‌లు వివరించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ బాలకార్మికుల ను వెట్టిచాకిరి నుంచి విముక్తి కలిగించడానికి అన్ని ప్రభుత్వ విభాగాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు సమ న్వయంతో పనిచేసి చిన్నారులను రక్షించి వారి బాల్యాన్ని కాపాడాల ని తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్లను కలెక్టర్, అదనపు కలెక్టర్, సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ శ్రీధర్, సి.ఐ. బి.అనిల్, మైనారిటీ సంక్షేమ అధికారి మేరాజ్ మహమూద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జే రంగారెడ్డి, జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు, జిల్లా విద్యా శాఖ అధికారి డి.మాధవి, ఇంటర్‌మీడియట్ జిల్లా అధికారి కల్పన, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, ఈ.డి. ఎస్సీ కార్పొరేషన్ మధుసూదన చారీ, డి.ఎస్.సి. డి.ఓ. నాగలేశ్వర్, డి.వై.ఎస్.ఓ. సురేష్, పాఠశాల అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.ఎం. షేక్, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్,జనవరి12: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్1,2,3,4, శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగులు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో bcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులు కులం, ఆదాయం, ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం బీ.సి. స్టడీ సర్కిల్ నూతన భవనము, కరీంనగర్ కార్యాలయంలో ఆఫీసు వేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఆటో బోల్తా.. పదిమందికి గాయాలు

మంథనిరూరల్, జనవరి 12: మంథని-ఖమ్మపల్లి ప్రధాన రహదారి గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్ వద్ద శుక్రవారం ఉదయం ఆటో అదుపు తప్పి బోల్తాపడటంతో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముత్తారం మండలం సీతంపల్లికి చెందిన నూనేటి రామయ్య తన ఆటోలో భూపాలపల్లి జిల్లా తాడిచర్ల నుంచ ప్రయాణీలకు తీసుకొని మంథని వైపు వస్తుండగా ఆటో ఆదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ రామయ్యతో పాటు ప్రయాణిస్తున్న 10 మందికి తీవ్ర గాయాలు కాగావారిని చికిత్స కోసం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఎడుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్, గోదావరిఖనికి తరలించారు.

ఎన్టీపీసీలో రోడ్డు ప్రమాదం

జ్యోతినగర్, జనవరి 12: ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. మేడిపల్లి సెంటర్ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ వద్ద బుల్లెట్, మరో బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మంచిర్యాల జిల్లా మందమర్రి(జీలకుంట)కి చెందిన మొలిశెట్టి మహేందర్, ఎల్కలపల్లికి చెందిన అతుకుల సాయిరాం, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

వెల్గటూర్, జనవరి 12: జగిత్యాల జిల్లాలో వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ శుక్రవారం ఇద్దరు మృతి చెందారు. వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన గట్ల లచ్చయ్య (62) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం మృతుడు లచ్చయ్య కొద్ది రోజుల క్రితం అయ్యప్ప మాల వేసుకున్నాడు. ఈ నెల 7న వెల్గటూర్‌లో గౌరి వెంకట చైతన్య ఏర్పాటు చేసిన అల్పాహారానికి వెళ్లిన లచ్చయ్య మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయాలు కాగా జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామ సమీపంలో కల్వర్టు పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన కండ్లె కృష్ణ (38) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ దత్తాత్రి కథనం ప్రకారం బుగ్గారం మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ తన భార్య గంగజలతో కలిసి జీవనోపాధి నిమిత్తం తుమ్మెనాల తల్లి ఇంటికి వచ్చారు. అక్కడే సమీపంలో గల గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. కృష్ణ మూర్ఛతో బాధ పడుతున్నాడు. ఈ నెల 1న నేరెళ్ల సమీపంలో గల కల్వర్టుపైన కూర్చొని ఉండగా హఠాత్తుగా కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను విడగొట్టి ఘర్షణలు సృష్టిస్తున్న బీజేపీ

- రాజకీయం కోసమే అయోధ్య రామమందిర నిర్మాణం
- మావోయిస్టు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ లేఖ

హుజూరాబాద్, జనవరి 12: సామాజిక రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం బీజేపీ భారత ప్రజలను మతాలుగా విడగొట్టి ఘర్షణలు సృష్టిస్తోందని తెలంగాణ మావోయిస్టు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట శుక్రవారం ఒక ప్రకటన వెలువడింది. రాజకీయ దురుద్దేశ్యంతోనే ఆర్ఎస్ఎస్, బీజేపీ అయోధ్య రామమందిర నిర్మాణం చేపట్టిందన్నారు. 500ఏళ్ల కిందట ముస్లింలు పవిత్రంగా విశ్వసించే బాబ్రీ మసీద్‌ను నిర్మించుకొని వాళ్ల విశ్వాసాల ప్రకారం ప్రార్థనలు చేస్తూ వస్తున్నారన్నారు. కానీ రాముడు జన్మించిన స్థలం అంటూ కట్టు కథలు సృష్టించి ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బ్రాహ్మణీయ, హిందుత్వ పాసిస్టు సంస్థలు 1992, డిసెంబరు 6న బాబ్రీ మసీద్‌ను బలవంతంగా కూల్చి వేశారన్నారు. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలో సుప్రీంకోర్టులో చారిత్రాత్మక వాస్తవాలను కప్పి పుచ్చి తీర్పు ఇప్పించారన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ దేశంలో 2024 సాధారణ ఎన్నికల్లో మూడో విడత అధికారాన్ని చేపట్టడానికి రామమందిరాన్ని వాడుకుంటున్నారన్నారు. 2047నాటికి పరిపూర్ణ హిందుత్వ రాజ్యంగా మార్చాలనే ప్రధాన లక్ష్యంతో బీజేపీ ముందుకెళ్తుందన్నారు. మతతత్వ రామ మందిర ఆవిష్కరణను ప్రజలు వ్యతిరేకించాలని లేఖలో పేర్కొన్నారు.

17క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- రైస్‌మిల్లులో సివిల్ సప్లయి అధికారుల తనిఖీలు
- యజమానిపై ఆగ్రహం

ఇల్లందకుంట, జనవరి 12: అక్రమంగా తరలిస్తున్న 17క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇల్లందకుంట పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన లింగారెడ్డి అనే వ్యక్తి ఉదయం ఎడ్లబండిపై కొత్తపల్లి నుంచి ఇల్లందకుంట వైపు తీసుకువస్తుండగా గమనించిన పోలీసులు దాన్ని వెంబడించారు. ఆ ఎడ్లబండి ఇల్లందకుంటలోని సీతారామాంజనేయ రైస్‌మిల్‌లోకి చేరింది. ఎస్సై రాజకుమార్ వెంటనే సివిల్ సప్లయి అధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారులు, రాష్ట్ర సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ (ఓఎస్‌డీ) అధికారుల బృందం మిల్లుకు వచ్చి తనిఖీలు నిర్వహించారు. మిల్లు యజమాని అందుబాటులో లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లులో స్టాక్ రిజిస్టర్, స్టాంపులు కూడా సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సదరు మిల్లు యజమాని 2021-22 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన 10 లారీల వడ్లు పట్టించి బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు పంపించకపోవడంపై మిల్లులో ప్రభుత్వానికి సంబంధించిన వడ్లు లేకపోవడంపై మండిపడ్డారు. 2022-23 సంబంధించిన బియ్యం కూడా ప్రభుత్వానికి అప్పగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపించిన బియ్యం కూడా క్వాలిటీగా లేవని, నెల రోజుల్లోగా ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం పంపించాలని చెప్పారు. లేని యెడల మిల్‌ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. గతంలో పంపించిన 290 క్వింటాళ్ల బియ్యాన్ని కూడా వాపస్ పంపిస్తే అవి కూడా మిల్లులో లేకపోవడంపై మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న బియ్యాన్ని నమూనాలు సేకరించి ల్యాబ్ పంపిస్తామని చెప్పారు. అందులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు రిపోర్టు రాస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయి ఓఎస్‌డీ ప్రభాకర్, సివిల్ సప్లయీ ఎన్‌ఫోర్స్ మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు, డీఎం రజినీకాంత్, డీసీఎస్‌వో సురేష్‌రెడ్డి, డీటీసీ, ఎస్‌ఐ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.


రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అర్హులకు కేంద్ర పథకాలు అందాలి

- కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్ గుప్తా


మల్కాపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అజయ్ గుప్తా, కలెక్టర్ అనురాగ్ జయంతి

కోనరావుపేట, జనవరి 12: అర్హులైన ప్రతీ ఒక్కరికి కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించేందుకు వికసిత్ సంకల్ప యాత్ర కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్పయాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్ గుప్తా అన్నారు. కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో శుక్రవారం వికసిత్ సంకల్ప్ యాత్రను ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ ద్వారా వ్యవసాయం ఎలా చేయాలనే అంశంపై ప్రత్యక్షంగా డ్రోన్ ద్వారా వరి పొలాలపై పిచికారి చేస్తుండగా ఆయన కలెక్టర్‌తో కలిసి తిలకించారు. అనంతరం అజయ్ గుప్తా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎలాంటి వివక్ష లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఎంత మంది ప్రయోజనాలు పొందారు, ఎంతమందికి అందాయి అని తెలుసుకోవడం కోసమే ఈ యాత్రను నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎలా అందుతున్నాయోనని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈవో గౌతమ్‌రెడ్డి, డీఆర్‌డీవో రవీందర్, రామకృష్ణ సర్పంచ్ ఆరే లత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కూడారై ఉత్సవం


వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కోరుట్ల, జనవరి 12 : పట్టణంలో అతిపురాతనమైన శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కూడారై ఉత్సవం (ఇత్తడి గంగాళంలో ప్రసాదం) ఘనంగా జరిగింది. అదేవిధంగా తిరుప్పావై ఉత్సవం అర్చనలు, అభిషేకాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బీర్నంది నరసింహాచారి, ఈఓ విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, అండాల్ గోష్టి బృందం పాల్గొన్నారు.

జమ్మికుంట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేంకటేశ్వ స్వామి ఆలయంలో శుక్రవారం కూడారై ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష తులసి కుంకుమార్చన చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముక్క జితేందర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

'ఖని'లో ట్రక్కు బీభత్సం

- బస్టాండ్ వద్ద ట్రాలీని ఢీకొట్టి హోటల్‌లోకి..
- ట్రాలీ, ద్విచక్ర వాహనం ధ్వంసం
- ఒకరికి స్వల్ప గాయాలు

కోల్‌సిటీ, జనవరి 12: గోదావరిఖనిలో శుక్రవారం తెల్లవారుజామున ట్రక్కు బీభత్సం సృష్టించింది. హైదరాబాద్ నుంచి కూల్ డ్రింక్స్ లోడ్‌తో కాగజ్‌నగర్‌కు వెళుతున్న ట్రక్కు (టీఎస్07యూపీ0198) గోదావరిఖని బస్టాండ్ వద్ద అదుపు తప్పి మున్సిపల్ చెత్త ట్రాలీని ఢీకొట్టింది. అక్కడే టీ స్టాళ్ల వద్ద ఉన్న ప్రజలు అప్రమత్తమయ్యారు. శబ్దంతో లోపలికి పరుగులు తీశారు. ఆటో ట్రాలీని తోసుకుంటూ వేగంగా ట్రక్కు బస్టాండ్ ముందున్న టీ స్టాల్‌లోకి దూసుకుపోయింది. మున్సిపల్ ఆటో డ్రైవర్ ట్రాలీలోనే ఉన్నాడు. ఆటో ట్రాలీ, మరో మోపెడ్, సైకిల్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ట్రాలీ డ్రైవర్ మున్సిపల్ కార్మికుడు రమేష్ ట్రాలీలోనే చిక్కుకోవడంతో స్థానికులు అతన్ని బయటకు తీశారు. స్వల్ప గాయలతో అతను బయట పడ్డాడు. ఈ ఘటనతో భయకంపితులై ప్రయాణీకులు పరుగు పెట్టారు. డ్రైవర్‌ను ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ స్వామి, ఏఎస్‌ఐ మల్లయ్య, ట్రాఫిక్ ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్‌లు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్ మహంకాళి స్వామి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటన స్థలాన్ని కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బాల రాజ్‌కుమార్, నాయకులు కాల్వ శ్రీనివాస్, పీచర శ్రీనివాస్ పరిశీలించారు.



ట్రాలీని ఢీకొట్టిన ట్రక్కు

ఎన్టీపీసీలో ఉమ్మడి జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు

జ్యోతినగర్, జనవరి 12: ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. పీటీఎస్‌లోని రింక్ కోర్టులో జరిగిన పోటీలను కరీంనగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దయానంద్ గాంధి, ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి బానేశ్వర్ రావు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన పలువురు చిన్నారులు రోలర్ స్కేటింగ్‌లో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పిల్లలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, ఎన్టీపీసీ అధికారులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తులు సమర్పించే చీరలకు వేలం

వేములవాడ టౌన్, జనవరి 12: వేమలవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో అమ్మవార్లకు భక్తులు సమర్పించే చీరల వేలం పాటను ఆలయ సమావేశ మందిరంలో ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. టెండర్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో మూడు టెండర్లు రాగా, ముగ్గురు కాంట్రాక్టర్లు వేలం పాటకు హాజరయ్యారు. గత వేలం పాటలో ఈ కాంట్రాక్ట్‌ను రూ. 78 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయాధికారులు తెలిపారు. నూతనంగా 2024-26కు గాను టెండర్ నిర్వహించగా స్వామివారి పాటగా రూ. 83 లక్షలతో అధికారులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్ రూ 95 లక్షల వరకు వేలంపాట పాడి అక్కడికి నిలిచిపోయారు. తరువాత ఆన్‌లైన్ టెండర్లను తెరిచిన అధికారులు సిద్దార్థ అనే కాంట్రాక్టర్ రూ. కోటి 1 లక్ష 116లకు కోడ్ చేయడంతో టెండర్ సిద్దార్థ అనే కాంట్రాక్టర్ కు ప్రకటించారు. కరోనా సమయంలో టెండర్‌కు ఇప్పటికి రూ. 18 లక్షల తేడా ఉండటంతో కాంట్రాక్టర్లు పెద్దఎత్తున సిండికేట్ అయినట్లు ఆరోపణలు బాహాటంగానే వినబడుతున్నాయి. అమ్మవారి చీరల వేలం పాట సుమారు ఒక కోటి 30 లక్షల వరకు పలుకుతుందని భావించగా, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి వేలం పాటను ఒక కోటి ఒక లక్ష రూపాయలకే పరిమితం చేశారని చర్చసాగుతుంది. అధికారుల కనుసైగల్లోనే కాంట్రాక్టర్‌లు సిండికేట్‌గా మారినట్లు ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ. 2 లక్షల వరకు చేతులు మారాయి అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఈవో కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా అనుకున్న టార్గెట్‌ను రీచ్ అయ్యామని, శాఖపరమైన విచారణ చేస్తామని అన్నారు. తిరిగి టెండర్ నిర్వహిస్తే కోటి దాటి మరింత ఆధాయం సమకూరే అవకాశం ఉందని ఆలయ వర్గాల్లో గట్టి వాదనలు వినిపిస్తున్నాయి.


వేలపాటకు హాజరయిన అధికారులు, కాంట్రాక్టర్లు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక జనవరి 12: మండలంలోని ఎలబాక గ్రామ శివారులో మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. వేగురుపల్లి సమీపంలోని మానేరు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్ యాజమాని కొమిరె ప్రణయ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జనవరి 12: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒక వాహనదారుడికి మూడు రోజుల జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 11 మంది వాహనదారులను శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి మూడు రోజులు జైలుశిక్ష, 2,500 రూపాయల జరిమానా, మరో 10 మంది వాహనదారులకు 18,500 రూపాయల జరిమానా విధించినట్లు ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు.

గంజాయి పట్టివేత..ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి12: కొత్తపల్లి మండల కేంద్రం, రేకుర్తిలలో కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఉదయం దాడులు నిర్వహించి గంజాయిని పట్టుకున్నారు. కరీంనగర్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి, ఈఎస్ శ్రీనివాసరావు, ఏఈఎస్ తాతాజీల ఆదేశాల మేరకు ఉదయం 10గంటల రేకుర్తి, కొత్తపల్లి గ్రామాలలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె.నాగేశ్వరరావు ఆద్వర్యంలో దాడులు నిర్వహించగా గొల్లపల్లి మండలం నంచెర్లకు చెందిన రంగు వినయ్, కిసాన్‌నగర్‌కు చెందిన యాదగిరిలు గంజాయితో పట్టుబడ్డారు. కొత్తపల్లికి చెందిన ఉపేందర్ పరారీ అయ్యాడు. ఇద్దరు నిందితుల వద్ద 1,726 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. గంజాయికి అలవాటు పడిన ఆరుగురు వియోగదారులను కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో బైండోవర్ కోసం అప్పగించారు. ఈ దాడులలో ఎస్‌ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్, కమలుద్దీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొడుకు మోసగించాడని సీపీని ఆశ్రయించిన రిటైర్డ్ కార్మికుడు

- కానిస్టేబుల్‌పై కేసు నమోదు

కోల్‌సిటీ, జనవరి 12: గోదావరిఖని టుటౌన్‌లో పని చేస్తున్న అర్నకొండ సదానందం అనే కానిస్టేబుల్‌పై శుక్రవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సింగరేణి రిటైర్డ్ కార్మికుడు అయిన తండ్రికి మాయమాటలు చెప్పి మోసగించి ఆస్తులు తన పేర గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడనే ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. బస్టాండ్ కాలనీలో నివాసముండే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు అర్నకొండ అంజయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె, పెద్ద కుమారుడు మరణించగా రెండవ కుమారుడు సింగరేణిలో పని చేస్తున్నాడు. మూడవ కుమారుడు సదానందం కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. బస్టాండ్ క్వార్టర్ల సమీపంలో అంజయ్య పేర ఉన్న ఇల్లు, స్వగ్రామం సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూరులోని రెండు ఎకరాల వ్యవసాయ భూమి చిన్న కుమారుడు సదానందం గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడని, తనను నమ్మించి మోసగించి గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడని, అప్పటి నుంచి తనను వేధిస్తున్నట్టు బాధితుడు పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు సదానందంపై ఐపీసీ 420, 384, 506, 24ఆఫ్ మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటీజన్ యాక్ట్ 2007 ప్రకారం ఎస్‌ఐ సమ్మయ్య కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

బోయినపల్లి, జనవరి 12: మండలంలోని నీలోజిపల్లి గ్రామానికి చెందిన గుండ్ల కనకయ్య (47) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్ల కనకయ్య కుటుంబం ఉపాధి కోసం కరీంనగర్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. కనకయ్య నీలోజిపల్లిలో గతంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. నిర్మాణానికి కొంత మేరకు అప్పు కావడంతో ఉపాధి కోసం కొద్ది నెలలుగా భార్యతో కలిసి కరీంనగర్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో కనకయ్య మద్యానికి బానిస అయ్యాడు. అప్పు తీర్చే మార్గం లేక మనోవేదన చెందుతుండేవాడు. గురువారం కరీంనగర్ నుంచి నీలోజిపల్లికి వచ్చి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్లూ క్రాస్‌కు చేరిన పందెం కోడి


పందెం కోడిని అప్పగిస్తున్న అధికారులు

భగత్‌నగర్, జనవరి 12: ఆర్టీసీ బస్సులో దొరికిన పందెం కోడి బ్లూక్రాస్ చేరింది. ఆర్టీసీ అధికారులు ముందుగా శుక్రవారం బహిరంగవేలం నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ కమిటీ నిర్ణయం మేరకు వేలం రద్దు చేశారు. అనంతరం ఆ పందెం కోడిని బ్లూక్రాస్ సొసైటీ జంతు సంరక్షణ ఇన్‌చార్జి తూం నారాయణకు కోడిని అందజేశారు.

వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చేరాలు

జమ్మికుంట, జనవరి 12: సాంకేతిక నైపుణ్యాన్ని వ్యవసాయంలో ఉపయోగించి నూతన ఆవిష్కరణలు తీసుకు వచ్చి రైతులకు వివరించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మాజీ సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి చేరాలు అన్నారు. పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శుక్రవారం మల్లారెడ్డి యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో జాతీయ యువత దినోత్సవం, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను రైతులకు సులభ రీతిలో అర్థం చేయించాలన్నారు. తద్వార అధిక దిగుబడులు, రాబడులు సాధించి ఆర్థిక, సామాజిక, శాస్త్రీయ పరంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఇప్పుడున్న ఉన్న యువత సాంకేతికంగా చాల చురుకుగా ఉన్నారని చెప్పారు. వారి నైపుణ్యం రైతుల పురోభివృద్ధికి తోడు కావాలని కోరారు. యవత దేశ పరంగా బాధ్యత యువతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శివశంకర్, శాస్త్రవేత్తలు డాక్టర్ మహేష్, డి శ్రీనివాస్, జె విజయ్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ కవిరాజ్, వంశీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మెట్‌పల్లి రూరల్, జనవరి, 12: మండలంలోని రంగరావుపేట గ్రామానికి చెందిన గంగుల సామిల్(32) అను వ్యక్తి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానిక చెందిన గంగుల సామిల్ కొంత కాలంగా మానసిక పరిస్థితి బాగలేక ఇంటి వద్దనే ఉంటున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడు సామిల్ తండ్రి గంగుల నరేష్ ఫిర్యాదు మేరకు కేసు ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 12: కరీంనగర్ బస్టాండ్ రోడ్‌లోని తెలంగాణ మెడికల్ షాపు పక్కన శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 45-50 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడు ధరించిన టీషర్ట్‌పై ఇండిగో పెయింట్స్ అని రాసిఉందని, గుర్తుపట్టిన వారు వన్‌టౌన్ సీఐ 8712670761, 9908440822లకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యూరీ గదిలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 12: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేములవాడకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయ ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లో ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకుని తరించారు. కాగా రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కులు చెల్లించకుని అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు సాయంత్రం తిరుగు పయాణమయ్యారు. కాగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని కేంద్ర టెక్స్‌టైల్ వంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్‌గుప్తా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వీచ్చేసిన ఆయనకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక దర్శనం అనంతరం మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వ దించగా ఆలయ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్ స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

మద్యం మత్తులో ఎస్సైపై బీజేపీ నేత దురుసు ప్రవర్తన

జ్యోతినగర్, జనవరి 12: మద్యం మత్తులో సప్ప నాగరాజు అనే బీజేపీ నాయకుడు ట్రాఫిక్ ఎస్‌ఐపై దురుసుగా ప్రవర్తించడంతోపాటు దూషించిన సంఘటన గురువారం సాయంత్రం మేడిపల్లి సెంటర్‌లో జరిగింది. ట్రాఫిక్ ఎస్‌ఐ టి.ఉదయ్ కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సప్ప నాగరాజు, మేకల నారాయణలపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మేడిపల్లి సెంటరులో రామగుండం ట్రాఫిక్ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తన సిబ్బంతో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో బైక్‌పై వెళ్తున్న నాగరాజు, నారాయణలను ట్రాఫిక్ పోలీసులు ఆపారు. బ్రీత్ ఎనలైజర్‌లో ఊదాలని బైక్ నడుపుతున్న నాగరాజుకు పోలీసులు చెప్పినప్పటికీ నిరాకరించాడు. ఈ క్రమంలో ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్‌తో పాటు డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ సిబ్బందిపై నాగరాజు, నారాయణలు దురుసుగా వ్యవహరిస్తూ దూషించారు. ఈక్రమంలో సంఘటన స్థలానికి వచ్చిన ఎన్టీపీసీ ఎస్‌ఐ జీవన్ బీజేపీ నాయకుడు నాగరాజు, నారాయణలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనపై దురుసుగా ప్రవర్తించడం, దూషించడంతో పాటు తన విధి నిర్వహణను ఆటంకపరిచాడని ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ ఎన్టీపీసీ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. నాగరాజు, నారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జీవన్ తెలిపారు.

చైల్డ్ పోర్న్ వీడియోలు అప్‌లోడ్ చేసిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, జనవరి 12: చైల్డ్ పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి ఫేస్‌బుక్ అకౌంట్‌లో అప్‌లోడ్ చేసిన వ్యక్తిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కిరణ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. కోనరావుపేట మండలం రామన్నపేట గ్రామానికి చెందిన మహమ్మద్ రజాక్ చైల్డ్‌పోర్న్ వీడియోస్ డౌన్‌లోడ్ చేసి ఫేస్‌బుక్‌లో అప్లోడ్ చేశాడు. హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ పోలీసు వారి సమాచారం మేరకు రజాక్‌పై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చైల్డ్ పోర్న్ వీడియోస్ అప్‌లోడ్ చేసినా, షేర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లెల్లలో చైన్ స్నాచింగ్

తంగళ్లపల్లి, జనవరి 12: మండలంలోని జిల్లెల్లలో చైన్ స్నాచింగ్ జరిగింది. జిల్లెల్ల గ్రామానికి చెందిన రుద్రారపు పోచవ్వ అసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని జంట ద్విచక్ర వాహనంపై పోచవ్వకు లిఫ్ట్ ఇచ్చారు. పోచవ్వ ఇల్లు గ్రామ శివారులో ఉండగా మధ్యలో రేషన్‌షాప్ వద్దకు రాగానే బియ్యం తీసుకు వెళ్లాలి ఇక్కడే దింపేయమని కోరింది. వాహనం దింపివేసి ఒక్కసారిగా పోశవ్వ మెడలోని గొలుసును లాగేసుకొని మల్లాపూర్ వైపు పారిపోయినట్లు బాధితురాలు పోచవ్వ తెలిపింది. సుమారు మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకు వెళ్లినట్లు తెలిపింది. మల్లాపూర్ రేణుకా ఆలయం వద్ద సీసీ కెమెరాలో ద్విచక్ర వాహనంపై ఉన్న జంట కదలికలు రికార్డు అయినట్లు స్థానికులు చెప్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోచవ్వ తెలిపింది.

కవులు సామాజిక నిర్మాతలు


పురస్కారం అందుకున్న తోట నిర్మలారాణి

కరీంనగర్ కల్చరల్, జనవరి 12: ప్రజాపక్షం వహించే కవులు నవసమాజ నిర్మాతలని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024కుగాను అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య పురస్కారాన్ని కవయిత్రి తోట నిర్మలారాణికి ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, అలిశెట్టి ప్రభాకర్ సతీమణి భాగ్యలక్ష్మి చేతులమీదుగా ప్రదానం చేశారు. తెవరే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెరవే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు, కవులు అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, అలిశెట్టి సంగ్రామ్, దామరకుంట శంకరయ్య, పీఎస్ రవీంద్ర, వెగ్గలం ఉషశ్రీ, కందుకూరి అంజయ్య, రామానుజం సుజాత, శ్రీనివాస్, పత్తెం వసంత, సరసిజ, నడిమెట్ల రామయ్య పాల్గొన్నారు.

విదేశాలకు పంపిస్తానని మోసం

కరీంనగర్ క్రైం, జనవరి 12: హాంగ్‌కాంగ్ పంపిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కరీంనగర్‌లోని ఇండో అరబ్ కన్సల్టెన్సీ సంస్థకు చెందిన మినహాజ్ అలీ, రఫిక్‌అలంపై కేసు నమోదు చేశామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గాజుల ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లేందుకు ఆంజనేయులు, మరో వ్యక్తితో కలిసి 2023న అక్టోబరులో కార్ఖనగడ్డలోని ఇండో అరబ్ కన్సల్టెన్సీ మినహాజ్ అలీ వద్దకు వెళ్లారు. హాంగ్‌కాంగ్‌కు వెళ్లేందుకు ఒక్కొక్కరికి రూ. 1.30 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. ఈ మేరకు ఆంజనేయులు రూ.1.10 లక్షలు, రాయుడు రూ. 1.20 లక్షలు ఇచ్చారు. మరో ఇద్దరిని కూడా హాంగ్‌కాంగ్‌కు పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితుడు ఫిర్యాదు చేశాడు.


వైభవంగా గోదాదేవి రంగనాయకుల కల్యాణం

మెట్‌పల్లి, జనవరి, 12: పట్టణంలోని ఎస్సారెస్పీ క్యాంపులోని కోదండరామాల యంలో స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణాన్ని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంప తులు, కమిటీ నిర్వహకులు మహాజన్ నరసింహులు దంపతులు వైభంగా జరిపిం చారు. తిరుప్పావై ధరూర్ మాస మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆలయం లోని స్వామి వారికి పురోహితులు రమాకాంత్ బృందం ప్రత్యేక అభిషేకాలు, పూ జలు, హారతి వంటి తదిర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్లు, ఈఈ అరుణ్‌కుమార్, శ్రీనివాస్, ఆర్మూర్ పోచ య్య, సుతారి బుచ్చిరాజు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణం పురోహితులు ఘనంగా జరిపారు. శుక్రవారం ఆలయంలోని ఉత్సవ మూర్తులకు పురోహితులు పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపి హారతి వంటి కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం పురోహితుల వేదమంత్రోచ్చారణల మధ్య గోదాదేవి రంగనాయకుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి మండలంలోని పలు గ్రామాల్లోని భక్త లు పాల్గొని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


స్వామి వారికి తలంబ్రాలు పోస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


ఓదెలలో షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ఓదెల, జనవరి 12 : మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో బిల్లులు పెండింగ్‌లో ఉంటే సర్పంచులు త్వరగా రికార్డు చేసుకొని బిల్లులు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి తారతమ్యం లేకుండా ప్రజాప్రతినిదులందరికీ సహకరిస్తానన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు,గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఎంపీపీ రేణుకాదేవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో సత్తయ్య పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై సర్పంచుల ఆగ్రహం

ముత్తారం, జనవరి 12: మండల స్థాయి అధికారులు నియంతలా పని చేస్తున్నారంటూ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 31తో సర్పంచుల పదవీకాలం ముగియనుందని, ఇంకా సర్వసభ్య సమావేశాలు పెట్టడం ఎందుకని అసహనం వ్యక్తం చేశారు. ఖమ్మంపల్లి సర్పంచ్ సమావేశం ప్రారంభం కాగానే నల్ల కండువాతో పోడియం ముందు బైఠాయించారు. ఎంపీడీవో కలికోట శ్రీనివాస్, ఎంపీవో వేణుమాధవులు తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని తన అనుమతి లేకుండానే ఉపసర్పంచ్‌తో గ్రామపంచాయతీలో సమావేశాలు ఏర్పాటు చేసి తీర్మానాలు చేస్తున్నారన్నారు. దీంతో తోటి సభ్యులు సముదాయించారు. ఖమ్మంపల్లిలో బతుకమ్మ చీరలు పంపిణీ చేయలేదని ఖమ్మంపల్లి గ్రామానికి వెళ్లిన చీరలు తిరిగి ఎంపీడీవో కార్యాలయానికి తెప్పించారని పంపిణీ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య, వైస్‌ఎంపీపీ సూదాటి రవీందర్రావు, ఎంపీడీవో కలికోట శ్రీనివాస్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బీ థర్మల్ విస్తరణకు చర్యలు : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అంతర్గాం, జనవరి 12: రామగుండం పట్టణంలోని 62.5మెగావాట్ల బీ థర్మల్ విద్యుత్ కేంద్రం విస్తరణకు చర్యలు చేపడుతానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం బీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే విద్యుత్ కేంద్రం స్థితి గతులు, భూముల లభ్యత మొదలగు విషయాలను ఎస్ఈ విజయేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండంలో విద్యుత్ ఉత్పాదనకు కావాల్సిన బొగ్గు, నీరు, భూములు అందుబాటులో ఉన్నా గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా విస్తరణకు నోచుకోలేదన్నారు. గత ప్రభుత్వం రామగుండాన్ని విస్మరించిందని, ప్రభుత్వంతో మాట్లాడి రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. బీ థర్మల్ విద్యుత్ కేంద్రం అధికారులు శంకరయ్య, శ్రీనివాసరావు, బాలకృష్ణ, సూర్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సలీంబేగ్, మాజీ కౌన్సిలర్ ఇనంపల్లి అంజులు, సిరిశెట్టి సతీష్‌గౌడ్, నాగరాజు, అష్రఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

అయోధ్యలో ఆర్ఎస్ఎస్, బీజేపీ దురుద్దేశ రాజకీయాలు

- మావోయిస్టు రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్

మంథని, జనవరి 12: అయోధ్యలో రామాలయ అవిష్కరణ పేరుతో ఆర్ఎస్ఎస్, బీజేపీలు దురుద్దేశ రాజకీయాలు చేస్తున్నాయని మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ఒక ప్రకటనలో ఆరోపించారు. మావోయిస్టు అగ్ర నేత జగన్ పేరిట ఈమేరకు శుక్రవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. మతతత్వ రామ మందిర అవిష్కరణనూ, ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న అశాస్త్రీయ, అచరిత్ర హిందూత్వ సంస్కృతినీ, భావజాలాన్నీ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం భారత ప్రజలను మతాలుగా విడగొట్టి వారి మధ్య ఘర్షణలు సృష్టిస్తున్న అత్యంత అభివృద్ధి నిరోధక, తిరోగమన బ్రాహ్మణీయ హిందుత్వ ఆధ్యాత్మిక సిద్ధాంతాన్ని తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ రహిత దేశాన్ని, రాష్ట్రాన్ని నిర్మించడానికి సమరశీల పోరాటాలు, దేశభక్తి ఉద్యమాలు చేపట్టాలని, భూస్వామ్య, బడాపెట్టుబడిదారుల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను ఉధృతం చేయాలని జగన్ ప్రజలకు పిలుపునిచ్చారు.

చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేందుకు రుణాలు

మంథని, జనవరి 12: సన్న, చిన్నకారు రైతులకు సహకార సంఘం ద్వారా రుణాలు అందజేస్తూ ఆర్థికంగా అండగా ఉంటున్నామని మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పలువురు రైతులకు దీర్ఘకాలిక రుణాలు మంజూరుకాగా, చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పెద్దిరాజు ప్రభాకర్, దేవళ్ల విజయ్ కుమార్, ఎంపీటీసీ గుమ్మడి సత్యవతి-రాజయ్య, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్‌లు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ నుంచి ఏడుకొండలు సస్పెండ్

గోదావరిఖని, జనవరి 12: సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలను సస్పెండ్ చేస్తున్నట్టు ఆ యూనియన్ కేంద్ర కమిటీ అధ్యక్షులు పెద్దపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మణిరాం సింగ్ తెలిపారు. శుక్రవారం గోదావరిఖని గాంధీనగర్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొద్దిరోజులుగా యూనియన్ వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ క్రమశిక్షణ చర్యలను అతిక్రమించినందున అతన్ని సస్పెండ్ చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సంజయ్‌కుమార్, రాజయ్య, గుండబోయిన ఓదెలు, కోటగిరి పాపయ్య, బొల్లు మల్లయ్య, గద్దల నారాయణ, భూపతి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రదాతకు నివాళి

కోల్‌సిటీటౌన్, జనవరి 12: గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు జెట్టి మల్లయ్య(75) నేత్రదాత సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. సదాశయ ఫౌండేషన్ మల్లయ్య కుటుంబ సభ్యులకు అభినందన పత్రాన్ని అందజేసింది. ఫౌండేషన్ బాధ్యులు సానా రామకృష్ణరెడ్డి, లింగమూర్తి, కెఎస్ వాసు, జెట్టి మల్లయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తర్వుల అందజేత

రామగిరి, జనవరి 12: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో పనిచేసే రహన్ షరీఫ్, తాళ్ళపల్లి నారాయణలకు ఎస్ఎల్‌పీ ప్రమోషన్ ఉత్తర్వులను శుక్రవారం జీఎం సుధాకర్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు. ఆర్జీ-3 డివిజన్‌లో 91 మంది ఉద్యోగులు అర్హత కలిగి ఉన్నారని వారికి సంబంధించిన ఉత్తర్వులను ఆయా గనులకు ఉత్తర్వులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘు, వెంకటరమణ, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, పద్మరాజు, లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన పంచాయతీ, పల్లెదావాఖాన భవనాలు

రామగిరి, జనవరి 12: మండలంలోని కల్వచర్లలో నూతనంగా నిర్మాణం చేపట్టిన గ్రామపంచాయతీ, పల్లేదావాఖాన భవనాలు ముస్తాబైయ్యాయి. జీపీ నిధులు రూ. 15లక్షలతో పల్లెదవాఖాన మహాత్మగాంధీ జాతీయ ఉపాధి పథకం కింద నూతన గ్రామపంచాయతీ భవనం రూ.23లక్షలతో నిర్మాణం చేపట్టిన భవన సముదాయాలను శనివారం మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు.

రేపటి నుంచి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

ఎలిగేడు, జనవరి 12 : మండలంలోని లాలపల్లి గ్రామంలో ఈనెల 14నుంచి శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలను జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి, సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వరాజేశ్వర్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం దిష్టికుంభం, సోమవారం లగ్నపట్నం, బుధవారం నాగవెల్లి పట్నం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడురోజులపాటు జరిగే ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

కోల్‌సిటీ, జనవరి 12: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రగతి, టీయూఎఫ్ఐడీసీ ద్వారా మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, ఇంజపురి పులేందర్, ముదాం శ్రీనివాస్, నాయకులు దుబాసి మల్లేష్, బొడ్డు రవీందర్, నగునూరి రాజు, గాదం నందు కోరారు. శుక్రవారం కమిషనర్‌కు 17 మంది కార్పొరేటర్ల సంతకాలతో వినతిపత్రాన్ని అందించారు. పట్టణ ప్రగతి నిధులతో అభివృద్ధి పనులకు కౌన్సిల్ మంజూరుఇచ్చిందని, టీయూఎఫ్ఐడీసీ పనులను కలెక్టర్‌కు ప్రతిపాదించారని, పనులను ప్రారంభించేలా చర్యలు కోరారు.

విద్యా సంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు


పెద్దపల్లి ట్రినిటి పాఠశాలలో వేడుకలు..


ధర్మారంలో..

సుల్తానాబాద్, జనవరి 12: సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీవాణి విద్యా సంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను లయన్స్ క్లబ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా గవర్నర్ డాక్టర్ విజయ ప్రారంభించారు. శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ ముందస్తు సంకాంతి వేడుకల్లో విద్యార్థినులు వేసిన రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలలో డైరక్టర్లు రేకులపల్లి సుష్మ శశాంక, ప్రిన్సిపాల్స్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 12 : మండలంలోని కాసులపల్లి ట్రినిటి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన ముగ్గులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాపురెడ్డి పరిశీలించారు. విద్యార్థులు బోగి మంటలు పెడుతూ గాలిపటాలను పట్టుకొని కోలాటాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భూదేవి, నర్సయ్య, సమ్మయ్య, రామస్వామి, గీత, మానస, సువార్త, అనూష, సాహిత్య, మవునిక, మంగ, రమణ, రాజేష్, సతీష్, శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ధర్మారం, జనవరి 12: మండల కేంద్రంలోని బ్రిలియంట్ విద్యా సంస్థల్లో శుక్రవారం ముందస్తు సంక్రాతి పండగ వేడుకలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు వేషధారణలతో ఆకట్టుకున్నారు. విద్యా సంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, సుజాత, వేణుమాధవ్, సౌమ్య, సురంజీని, స్వర్ణలత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం జనవరి 12: మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలతోపాటు పోతారం గ్రామపంచాయతీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోతారంలో ముఖ్యఅతిథిగా జడ్పిటీసీ స్వర్ణలతఅశోక్‌కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి కమల, పోతారం సర్పంచ్ నెత్తేట్ల మహేందర్, ఉప సర్పంచ్ తుడూరు నరేందర్ పాల్గొన్నారు.

రామగిరి, జనవరి 12: మండలంలోని కల్వచర్లలోని కృష్ణవేణి, హిల్ ఫోర్ట్ పాఠశాలల్లో శుక్రవారం ముందుస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. సర్పంచ్ గంటపద్మ, పన్నూరు సర్పంచ్ అల్లంపద్మ, నాయకులు ముకుందరెడ్డి, వెంకటరమణరెడ్డి, శ్రీదేవి, శరణ్య, సురేందర్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ బర్ల శ్రీనివాస్, డైరెక్టర్స్ శ్రీధర్‌బాబు, అనిల్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జనవరి 12: మండలంలోని పెగడపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పెగడపల్లి, ఇప్పలపల్లిలోగల క్రిసెంట్ హైస్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాల అధినేత సయ్యద్ వజహతుల్ల యాజ్, హెచ్ఎం సయ్యద్ నసీర్, ఉపాధ్యాయులు బైరి రాజావీరు, జాఫర్, నాజిమ్, నిరాహారిక, పద్మజ, మౌనిక, రమాదేవి, మమత పాల్గొన్నారు.

వైభవంగా గోదా రంగనాయకుల కల్యాణం


సుల్తానాబాద్‌లో గోదా కల్యాణోత్సవం

సుల్తానాబాద్, జనవరి 12: స్థానిక శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలోని నూతన కళ్యాణ మండపంలో శుక్రవారం గోదా రంగనాయకుల స్వామి వారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ పల్లా మురళీధర్ సదాలక్ష్మి నిర్వహణలో కళ్యాణోత్సవం కన్నుల పండువలా జరిగింది. కళ్యాణోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే విజయరమణారావుకు ఆలయ చైర్మన్ మురళి తదితరులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మురళి సదాలక్ష్మి, ఎంపీపీ బలాజీరావుస్వరూప, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమతక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 12 : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చెన్నకేశ్వర ఆలయంలో శ్రీగోదాదేవి రంగనాయకస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వివేకానందుడి జయంతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 12 : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు గాయత్రి జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్ వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగచంద్ర, అజయ్, రాసురి ప్రవీణ్, విష్ణుభక్తుల రిషి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంథని, జనవరి 12: భారతదేశ సాంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పి తన ఉపన్యాసాలతో యువతలో స్ఫూర్తి నింపిన స్వామి వివేకానంద అందరికీ ఆదర్శమని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు కొనియాడారు. వివేకానందుడి జయంతిని పురస్కరించుకొని స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బెజ్జంకి డిగంబర్, తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, ఆకుల కిరణ్‌లు పాల్గొన్నారు. అలాగే స్థానిక వివేకానంద విగ్రహానికి బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బూడిద తిరుపతి, నేతలు చిలువేరి సతీష్‌కుమార్, బోగోజు శ్రీనివాస్, సత్యప్రకాష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 12: మండలంలోని పలు గ్రామాల్లో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దబోంకూరులో మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కలవేనరవి, సీపెల్లి శ్రీనివాస్, కడారి రాయలింగం, మిట్టపల్లి రాజేశం, చంద్రమౌళి, గణేష్, సంజీవ్, రాజు, గజ్జల శ్రీకాంత్, కృష్ణమాచారి, నరహరి, సతీష్, పవన్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 12: స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం కాలనీలో వివిధ సంఘాలు ఘనంగా జరిపాయి. సింగరేణి పాఠశాల చౌరస్తాలోగల వివేకానంద విగ్రహం వద్ద ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పై ఫరీద్ వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామంచి శ్రావణ్, నవీన్, సురేష్, అనిల్ కుమార్, అరుణ్‌ప్రసాద్, సాయికుమార్‌లు పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండేటి రాజేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హరిహర నాయక్, మోత్కు అవినాశ్, సారయ్యనాయక్, సురేందర్, సంపత్, అఖిల్ పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, జనవరి 12: నెహ్రూ యువకేంద్రం కరీంనగర్-పెద్దపల్లి సహకారంతో నేషనల్ యూత్ ప్రాజెక్టు, యూత్ వెల్ఫేర్, నిషా ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని కాకతీయ జూనియర్ కళాశాలలో జరిగిన స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ప్రసంగించారు. ఎన్‌వైపీ రాష్ట్ర అధ్యక్షుడు యాదవరాజు, స్నేహసాహితీ అధ్యక్షులు ఏలేశ్వరం వెంకటేష్, ప్రిన్సిపల్ ఉపేందర్, వైద్యులు నారాయణ, కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ, శ్రీరామ విద్యానికేతన్ పాఠశాల హెచ్ఎం జ్యోతి, పాల్గొన్నారు. స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ రమాకాంత్ వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు డాక్టర్ సురేష్‌కుమార్, రమేష్‌రెడ్డి, సావిత్రి, అజయ్, సల్మాసుల్తానా, అజీజ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రసాద్ పాల్గొన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాధవి, ఎన్ఎస్ఎస్ పీవో జీడి కనకయ్య, అధ్యాపకులు శ్రీధర్, రెహమాన్, మంతెన శ్రీనివాస్, శాంత రామారావు, శంకరయ్య, జగదీశ్వరి, కళారాధ, శారదా, శ్రీగోదా, అల్తాఫ్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సాంస్కృతిక క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, ఎన్‌వైపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సతీమణి మనాలిఠాకూర్ హాజరై మాట్లాడారు. ప్రిన్సిపాల్ అంజయ్య, కవి, రచయిత ఏలేశ్వరం వెంకటేష్, ఎన్‌వైపీకోఆర్డినేటర్ యాదవరాజు, అధ్యాపకులు రజిత, విజయ, మాజీ కార్పొరేటర్ ఉమాదేవిసాంబమూర్తి, సంతోష్, ఎన్.శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు మామిడి రాజేష్ ఆధ్వర్యంలో ప్రధానచౌరస్తాలో వివేకానంద జయంతి నిర్వహించారు. కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు మాతంగి రేణుక, నాయకులు కొమ్ము శ్రీనివాస్, సురేష్, రవి, స్వరూప, మల్లేష్, శ్రావణ్ పాల్గొన్నారు. రామగుండం లయన్స్ క్లబ్ మగువ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి, జవహర్‌నగర్‌లోని సరస్వతి శిశుమందిర్‌లో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మగువ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి, సోమారపు లావణ్య, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ హిమబిందు, శశికళ, డాక్టర్స్, సరస్వతి శిశుమందిర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామగిరి, జనవరి 12: మండలంలోని బేగంపేట్‌లో స్వామి వివేకనంద జయంతి వేడుకలను ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. సర్పంచ్ బుర్రపద్మ ముఖ్యఅతిథిగా హజరయ్యారు. పీహెచ్‌సీలో ఉచిత రక్త పరీక్షలను నిర్వహించారు. ఎంపీటీసీ మారగొని కరుణ, ఉప సర్పంచ్ మంతెన చంటి, నాయకులు మాదాసి శ్రీనివాస్, సెక్రటరీ రామ్మోహన్, అదిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జూలపల్లి, జనవరి 12: మండల కేంద్రంలో శుక్రవారం స్వామి వివేకనంద జయంతి వేడుకలను బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివేకనంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమ్మ ఐలయ్య, మెరుగు రమేష్, రాంరెడ్డి, సతీష్, వెంకటేశం పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జనవరి 12: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సుల్తానాబాద్ పట్టణంలోని విగ్రహం వద్ద ఎమ్మెల్యే విజయరమణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని రేగడిమద్దికుంటలో జరిగిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సామల రాజేంద్ర ప్రసాద్, రేకులపల్లి శశాంక, హరిక్రిష పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జనవరి 12: బీజేపీ మండల అధ్యక్షులు చిలువేరు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు శుక్రవారం నిర్వహించారు. తోట శ్రీధర్, చిర్లంచ తిరుపతి, పూరేళ్ల దిలీప్, బైరి రాంమూర్తి, దాసరి ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.


మంథనిలో నివాళులర్పిస్తున్న పుట్ట మధు


గోదావరిఖని ప్రధానచౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లి రూరల్, జనవరి 12: పెద్దపల్లి మండలం నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దబోంకూరు, పెద్దకల్వలలో శనివారం విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ సహాయ డివిజనల్ ఇంజనీర్ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నర్సింహులపల్లి విద్యార్థికి అభినందన

ధర్మారం, జనవరి12: అమెరికాకు చెందిన హార్వర్డ్ యూనివర్శిటి, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ పాఠశాల, ఇంటర్‌స్థాయి విద్యార్థులకు 2024 సంవత్సరానికిగాను ప్రోగ్రాం పర్ సైంటిపిక్లీ ఇన్‌గ్రైడ్ లీడర్‌షిప్ శిక్షణకు ఎంపికై పూర్తి చేసుకున్న ధర్మారం మండలం నర్సింహులపల్లి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బొట్ల లక్ష్మిగణేష్‌ను పలువురి అభినందించారు. ఉస్మానియా యూనివర్శిటీలో ఈనెల 7నుంచి శుక్రవారం నిర్వహించిన శిక్షణ పూర్తి చేయడం పట్ల డీఈవో మాధవి, సెక్టోరియర్ అధికారి డాక్టర్ పీఎం షేక్, పాఠశాల హెచ్ఎం రవీందర్‌లు అభినందించారు. సమర్థవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థి లక్ష్మిగణేష్‌ను గ్రామస్థులు ప్రశంసించారు.

డ్రమ్ సీడర్‌తో అధిక దిగుబడి

ముత్తారం, జనవరి 12: వ్యవసాయ కూలీలతో కాకుండా డ్రమ్ సీడర్ ద్వారా నేరుగా వరి విత్తనాలను మడులలో పెట్టుకోవడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి చిన్నం శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని పలువురు రైతులు డ్రమ్ లీడర్ ద్వారా నాటిన వరి పొలాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం రైతులకు పలు యాజమాన్య పద్ధతులను వివరించారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్బన్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములకు క్లోరో 80ఎంఎల్ ఎకరానికి వాడడం వల్ల నివారించవచ్చునని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో చించిరెడ్డి బాపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఆందోళన


కాపులపల్లిలో అందోళన చేస్తున్న మహిళలు

పెద్దపల్లి రూరల్, జనవరి 12 : పెద్దపల్లి మండలం కాపులపల్లికి చెందిన మహిళా సంఘాల సభ్యులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. గ్రామంలో 17 మహిళా సంఘాలు సభ్యులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించే క్రమంలో గ్రామ సీఏ లక్ష్మీ, సీఎస్పీ సెంటర్ నిర్వాహకురాలు పర్స స్వప్న 26లక్షల రూపాయలు స్వాహా చేశారు. రెండేళ్లు గడుస్తున్నా అధికారులు వారిపై చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. తమ బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిన వితంతు, వృద్ధాప్య ఫించన్‌లతో పాటు రైతుబంధు సహాయం డబ్బులు తీసుకునేందుకు వీలులేకుండా బ్యాంకు అధికారులు ఖాతాలను ఫ్రీజ్ చేశారని తెలిపారు. దీనిపై అధికారులను తాము వివరణ కోరగా రుణాలు తిరిగి చెల్లించనందున తమ ఖాతాల నుంచి డబ్బులను వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

మెడికల్ ఎంప్లాయిస్ కార్యాలయాన్ని తొలగించవద్దు

కళ్యాణ్‌నగర్, జనవరి 12: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 20 సంవత్సరాల క్రితం నిర్మించిన ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయాన్ని తొలగించవద్దంటూ శుక్రవారం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుకు ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ గౌస్, నాయకులు శనిగల శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేసే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నామని, ఇతర నిర్మాణాల పేరుతో కార్యాలయాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తున్నారని, దీనిని విరమించుకోవాలని వారు కోరారు. లేకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు


ఆపరేషన్ అవసరమున్న వారిని కరీంనగర్‌కు పంపిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 12: రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్లు రేకుర్తి కంటి ఆసుపత్రిలో నిర్వహించేందుకు 30మంది వృద్ధులను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి మాట్లాడుతూ రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్టు, ఇక్కడ కంటి పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరం ఉన్న 30మందికి రేకుర్తి కంటి ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి బంక కళావతి, మనిషా అగర్వాల్, తానిపర్తి గోపాల్‌రావు, మేడిశెట్టి గంగాధర్, కంజాపురం రాజేందర్, మనోజ్‌కుమార్, లక్మారెడ్డి, పాకాల గోవర్ధన్‌రెడ్డి, బేబీగోపాల్ త్రివేది పాల్గొన్నారు.

ఘనంగా బసంత్‌కుమార్ బిర్లా జన్మదిన వేడుకలు

పాలకుర్తి, జనవరి 12: మండలం పరిధిలోని బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీ ఆఫ్ బీర్ల గ్రూప్ చైర్మన్ బసంత్‌కుమార్ బిర్లా 103 వ జన్మదిన వేడుకలను శుక్రవారం కంపెనీ అధికారులు, కార్మిక సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి,కంపెని అధికారులు శ్రీనివాసరెడ్డి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 12: ఇద్దరు అంధుల జీవితాల్లో నింపి ఆదర్శంగా నిలిచాడు సింగరేణి ఓబీ కార్మికుడు చింతపట్ల రాజయ్య. పెద్దంపేట గ్రామానికి చెందిన రాజయ్య గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందగా నేత్రదాన సదాశయ ఫౌండేషన్ సభ్యులు నేత్రదాన ఆవశ్యకతను వివరించగా రాజయ్య కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకారం తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్ టెక్నీషియన్ రాజయ్య నేత్రాలను సేకరించి హైద్రాబాద్‌కు తరలించారు. విశాదంలోనూ సమాజ హితాన్ని కాంక్షించి నేత్రదానానికి ముందుకు వచ్చిన రాజయ్య కుటుంబ సభ్యులు సంజీవ్, శ్వేత, వందన, వెంకటేష్, సంఘవి, శ్రీనివాస్‌లను సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి తదితరులు అభినందించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

మంథని, జనవరి 12: క్రైస్తవులు ఆధ్యాత్మిక చింతనతోనే మానసికంగా ప్రశాంతంగా ఉంటారని తిరుపతి నుంచి వచ్చి దైవజనులు ఎంఎస్ ఏబీనేజర్ అన్నారు. శుక్రవారం స్థానిక సీయోను ప్రార్థన మందిరంలో జరిగిన నూతన సంవత్సర ఆశీర్వాద కూడికలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో పాస్టర్లు వల్లూరి ప్రభాకర్, పెంద్రు ప్రసన్నకుమార్, ఆజ్మీరా దయారాజ్, మంథని మార్కు, సామ్యేల్, సంఘపెద్దలు అంకరి కుమార్, ఎంకే జోసఫ్, మంథని ప్రసాద్, రామగిరి కుమార్, రమేష్‌లు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో సహస్ర దీపాలంకరణ

పెద్దపల్లి రూరల్, జనవరి 12: మండలంలోని నిట్టూరు శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు స్వస్తిక్, ఓం గుర్తులకు గీసి పూలు, దీపాలతో అలంకరించారు. అనంతరం ఆలయంలో కుంకుమ పూజ, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక కార్యక్రమాల్లో గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొండపకా వెంకటాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.